# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 03-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సమ్మిళిత వృద్ధి, ఆవిష్కరణలకు ఉత్ప్రేరకాలుగా వ్యవహరించాల్సిన ప్రత్యేక బాధ్యత విశ్వవిద్యాలయాలపై ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ భారత్ అమెరికా దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం నిరంతర చర్చలు, సహనం ఫలితంగానే సాధ్యమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
- ❖ భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే భారత్ అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.
- ❖ లోక్ సభలో ఈరోజు తీవ్ర గందరగోళం సృష్టించిన 8 మంది సభ్యులను సభాపతి సస్పెండ్ చేశారు.
- ❖ మణిపూర్ నూతన ముఖ్యమంత్రి అభ్యర్థిగా యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ ఎంపికయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సమ్మిళిత వృద్ధి, ఆవిష్కరణలు, సామాజిక పరివర్తనకు ఉత్ప్రేరకాలుగా వ్యవహరించాల్సిన ప్రత్యేక బాధ్యత విశ్వవిద్యాలయాలపై ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఒడిశా పర్యటనలో భాగంగా బాలాసోర్‌లోని ఫకీర్ మోహన్ విశ్వవిద్యాలయం 12వ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ... సాంకేతిక అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, సమాజంలోని అన్ని వర్గాలు కలిసి పురోగమించినప్పుడే దేశం వేగవంతమైన శ్రేయస్సును సాధించగలదని అన్నారు. పట్టభద్రులైన విద్యార్థులు సామాజిక బాధ్యత వహించాలని, దేశ నిర్మాణంలో చురుకుగ్గా పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు విశ్వవిద్యాలయంలో కొత్తగా నిర్మించిన వెయ్యి సీట్ల ఆడిటోరియంను రాష్ట్రపతి ప్రారంభించారు. ఇక రేపు పూరీలోని శ్రీ జగన్నాథ ఆలయాన్ని రాష్ట్రపతి దర్శించుకోనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ అమెరికా దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం నిరంతర చర్చలు, సహనం ఫలితంగానే సాధ్యమైందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఎన్డీఏ పార్లమెంటరీ సమావేశంలో ఎంపీలను ఉద్దేశించి ఆయన ఈరోజు మాట్లాడుతూ.. ఈ వాణిజ్య ఒప్పందం అనుకూల ఆర్థిక వాతావరణాన్ని సృష్టించడంతో పాటు, అంతర్జాతీయ వాణిజ్య చర్చల్లో స్థిరమైన, సమతుల్య దృక్పథాన్ని ప్రతిబింబించిందని చెప్పారు. సుంకాల అంశంపై ప్రతిపక్షం విమర్శలు చేసినప్పటికీ ప్రభుత్వం సహనంతో వ్యవహరించిందని, ఆ ఫలితాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని భారత్ అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుదని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ అన్నారు. ఈ వాణిజ్య ఒప్పందం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ స్థానాన్ని బలోపేతం చేస్తుందన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్ణయాత్మక నాయకత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ విశ్వాసాన్ని ప్రతిబింబించే ఒప్పందాన్ని సాధించిందని చెప్పారు. సంక్లిష్టమైన చర్చలు, అధిక పరస్పర సుంకాలు వంటి సవాళ్లు ఉన్నప్పటికీ.. భారతదేశం  తన ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ.. సమతుల్య మార్కెట్ ప్రాప్యతను నిర్ధారించేలా ఈ ఒప్పందాన్ని విజయవంతంగా చేసుకుందని చెప్పారు. ఈ వాణిజ్య ఒప్పందం రైతులు, మత్స్యకారులు, MSMEలు, మహిళలు, యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని పీయూష్ గోయల్ వివరిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా లోక్ సభలో ఈరోజు విపక్ష సభ్యులు తీవ్ర గందరగోళం సృష్టించడంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. సభలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి, నిరసన పేరుతో కాగితాలను చింపి స్పీకర్ చైర్ వైపు విసిరారన్న కారణంతో 8 మంది విపక్ష ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పీకర్ ప్యానెల్ ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన  ఏడుగురు, సీపీఐ(ఎం) పార్టీ చెందిన ఒకరు ఈ సస్పెన్షన్ జాబితాలో ఉన్నారు. అంతకు ముందు పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఎంపీలను సస్పెండ్ చేయాలని కోరుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం సభ రేపు ఉదయం 11 గంటలకు వాయిదా పడింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పీఎం-కిసాన్ పథకం కింద ఇప్పటివరకూ 21 విడతల్లో 4 లక్షల కోట్ల రూపాయలకు పైగా రైతులకు ప్రభుత్వం జమ చేసిందని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్ నాథ్ ఠాకూర్ వెల్లడించారు.  ఈరోజు లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధాన మిస్తూ... సాగు భూమి ఉన్న రైతుల అవసరాలను తీర్చడానికి 2019లో ప్రారంభించిన పీఎం-కిసాన్ పథకం కింద సంవత్సరానికి ఆరు వేల రూపాయలను మూడు వాయిదాలలో నేరుగా రైతుల ఖాతాలకు బదిలీ చేస్తున్నామని చెప్పారు. ఈ పథకం కింద, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, ధృవీకరించాల్సిన బాధ్యత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై ఉందని అన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద ప్రభుత్వం ఇప్పటివరకు 14 వేల 771 కోట్ల రూపాయలు కేంద్ర ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు అందించిందని నూతన పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యెస్సో

నాయక్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఈరోజు ఆయన లిఖితపూర్వక సమాధానమిస్తూ.. 2024 ఫిబ్రవరిలో ఈ పథకం ప్రారంభమైనప్పటి నుండి దేశవ్యాప్తంగా మొత్తం 20,85,000 రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌లు ఏర్పాటు చేయబడ్డాయని, దీనివల్ల 26 లక్షలకు పైగా గృహాలు లబ్ధి పొందాయని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మణిపూర్ నూతన ముఖ్యమంత్రి అభ్యర్థిగా యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ ఎంపికయ్యారు. ఈరోజు జరిగిన బీజేపీ శాసనసభాపక్ష శాసనసభ సమావేశంలో ఆయనను తదుపరి ముఖ్యమంత్రిగా సభ్యులు ఎన్నుకున్నారు. మణిపూర్ ప్రస్తుత శాసనసభ పదవీకాలం 2027 వరకు ఉంది. 2023 మే నుంచి మణిపూర్‌లో చెలరేగిన ఘర్షణల కారణంగా అక్కడ అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో గతేడాది ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ రాజీనామా చేయడంతో అక్కడ రాష్ట్రపతి పాలన విధించారు. రాష్ట్రపతి పాలనకు ఏడాది పూర్తికానున్న నేపథ్యంలో ఖేమ్‌చంద్ సింగ్ నూతన ముఖ్యమంత్రి అభ్యర్థిని బీజేపీ ఎన్నుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పరీక్షా పే చర్చ 9వ ఎడిషన్ ఈనెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రసారం కానుంది. ఈ కార్యక్రమాన్ని వీక్షించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలను కోరారు. ఒత్తిడి లేని పరీక్షల ప్రాముఖ్యతను గురించి ప్రస్తావిస్తూ... పరీక్షలలో సవాళ్లను అధిగమించడం, సమతుల్యతను కాపాడడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం వంటి వివిధ అంశాలను ప్రధానమంత్రి ఈ కార్యక్రమంలో తెలియజేస్తారు. ఈ సంవత్సరం దేవ్ మోగ్రా, కోయంబత్తూర్, రాయపూర్, గువహటికి చెందిన విద్యార్థులతో న్యూ ఢిల్లీలోని లోక్ కళ్యాణ్ మార్గ్ లో సంభాషించనున్నట్లు నరేంద్రమోదీ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా పీఎం మిత్ర (మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అప్పారెల్ పార్కుల) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఏడు ప్రాంతాలను ఎంపిక చేసింది. తమిళనాడులోని విరుదునగర్, తెలంగాణలోని వరంగల్, గుజరాత్ లోని నవసారి, కర్ణాటక లోని కలబురగి, మధ్యప్రదేశ్ లోని ధార్, ఉత్తరప్రదేశ్ లోని లక్నో, మహారాష్ట్రలోని అమరావతిలో పీఎం మిత్ర పార్కులను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం ఏడేళ్ల కాలానికి 2027-28 వరకు 4 వేల 445 కోట్ల రూపాయల నిధులు కేటాయించింది. పీఎం మిత్ర పథకం ద్వారా ఒక్కో పార్కుకు సుమారు 10 వేల కోట్ల రూపాయల పెట్టుబడి వస్తుందని, తద్వారా 3 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. పెట్టుబడులను ఆకర్షించేందుకు, ఈ పార్కులను సమర్థవంతంగా అమలు చేయటానికి అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ స్థాయిలో రాష్ట్రాలు, పెట్టుబడిదారులు, పొటెన్షియల్ పార్క్ డెవలపర్లతో సహా వివిధ వాటాదారులతో ప్రభుత్వం 200లకు పైగా సంప్రదింపులు జరిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 81 వేల 666 పాయింట్ల వద్ద లాభంతో ప్రారంభమై.. చివరికి 2 వేల 073 పాయింట్ల లాభంతో 83 వేల 739 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 639 పాయింట్లు లాభపడి 25 వేల 727 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 90 రూపాయల 26 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4 వేల 921 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం ఉత్పత్తి ఆధారిత ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు డీప్-టెక్ స్టార్టప్‌లకు ఇంక్యుబేటర్ సెంటర్లు మద్దతునివ్వాలని ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు ప్రొఫెసర్ అజయ్ సూద్ చెప్పారు. న్యూఢిల్లీలో ఈరోజు

జరిగిన అటల్ ఇన్నోవేషన్ మిషన్ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ... ఆవిష్కర్తలకు మెంటర్‌షిప్, మార్కెట్ యాక్సెస్ అందించడం ద్వారా ఇంక్యుబేటర్లు, ఇంటర్మీడియరీ సంస్థలు ప్రయోగశాల పరిశోధన మార్కెట్ విలువ సృష్టి మధ్య కీలకమైన వారధిగా పని చేస్తాయన్నారు. దేశంలో 1,100లకు పైగా ఇంక్యుబేటర్లు ఉన్నాయని, వాటిలో చాలా వరకూ టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయని.. ఇవి ఆవిష్కరణ మద్దతుకు ప్రాప్యతను ఇస్తాయని చెప్పారు.

==============================

==============================